ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

3

శుక్రవారం 25 ఏప్రిల్ 2025



రహదారి వెంట ఒంటెల ప్రయాణం



రహదారి వెంట ఒంటెల ప్రయాణం చూపరులను ఆకట్టుకుంటోంది. ఉపాధి నిమిత్తం రాజస్థానీయులు మన రాష్ట్రానికి వలస వచ్చారు. బతుకు దెరువు కోసం వచ్చిన వారు మైళ్ల కొద్దీ ఒంటెలతోనే ప్రయాణం సాగిస్తున్నారు. సామగ్రిని ఒంటెలపై పెట్టి, తమ పిల్లలతో వేసవికాలం ముగిసే వరకు పలుచోట్ల నివాసం ఏర్పాటు చేసుకుంటూ ఇలా పయణమవుతుంటారు. వలస జీవులు మండుటెండలో కాలినడుకన ఒంటెలతో లక్షెట్టిపేట నుంచి దండేపల్లి వైపు ప్రధాన రహదారి గుండా వెళ్తుండగా తీసిన దృశ్యాలు.. - దండేపల్లి, ఆంధ్రజ్యోతి

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

నస్పూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మినీ టీచర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నస్పూర్ లోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ ఏవో సంతోష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల విపరీతంగా ఉన్నందున అంగన్ వాడీ కేంద్రాలకు మే మొత్తం సెలవు ప్రకటించాలన్నారు. ఇది వరకు ములుగు పర్యటన సందర్భంగా మంత్రి సీతక్క మే నెలంతా సెలవు ఇస్తామని హామీ ఇచ్చారని, మే నెల దగ్గర పడుతున్నప్పటికీ ఏలాంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, నాయకులు దాసరి రాజేశ్వరి, సవిత, విరోనిక, అనురాధ, పద్మ, ప్రవీణ, శారద, సుగుణ, వెంకన్న, శేఖర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు

పీసీసీ పరిశీలకుల నియామకం

మంచిర్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై ఏఐసీసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందు లో భాగంగా ఒక్కో జిల్లాకు ఇద్దరు పరిశీలకులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోను పీసీసీ పరిశీలకుల నియమాకాన్ని చేపట్టింది. మంచిర్యాలకు జంగ రాఘవరెడ్డి, సీహెచ్. రాంభూపాల్ ఆదిలాబాద్‌కు తాహెర్ బిన్ హందాన్, మంచిర్యాలకు చెందిన సీనియర్ నాయకుడు చిట్ల స త్యనారాయణ, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఎండీ రియాజ్, అన్నయ్యగౌడ్, నిర్మల్ జిల్లాకు ఎం. చంద్రశేఖర్‌గౌడ్, ఎండీ అవేజ్ ను నియమించారు. ఈసందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు నియామకమైన చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షీ నటరాజన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. గాంధీభవన్‌లో పీసీసీ అబ్జర్వర్లు సమావేశం జరిగింది. కొత్తగా నియామకమైన పరిశీలకులు వారి పరిధిలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు, మే 4 నుంచి 10వ తేదీ వరకు అసెంబ్లీ / బ్లాక్ లేవల్ సమావేశాలు మే 13 నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ సంస్థాగత నిర్మాణానికి కృషి చేయనున్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన వీరయ్యను గురువారం జిల్లా కేంద్రంలోని న్యాయ స్థానంలో కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్కను అందజేశారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

- లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్

లక్షెట్టిపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని లక్షెట్టిపేట సీఐ గోపతి సురేష్ అన్నారు. రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని మహాలక్ష్మీవాడలో బుధవారం రాత్రి కళాజాతా బృందం సభ్యులచే ఆత్మహత్యలు, సైబర్‌క్రైమ్, డబల్100, షీటీం, గంజాయి, జూదంలపై కళాకారులచే ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్సై పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో యువత గంజాయికి అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నాయన్నారు. క్షణికావేశంలో తొందరపడి ఆత్మహత్యలు చేసుకోకూడదని బ్యాంక్ లావాదేవీలు ఫోన్‌లో ఎవరికి చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై అ న్వర్, పోలీసు సిబ్బంది కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

గర్మిళ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్స్ ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ నూతన కమిటీని గురువారం మంచిర్యాలలోని టీఎన్‌జీవో భవన్‌లో ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా గడియారం శ్రీహరి, సెక్రటరీగా వనజారెడ్డి, అడిషనల్ సెక్రటరీగా శంకర్, కో ఛైర్మన్‌లుగా చక్రపాణి, కృష్ణ, వెంకటేశ్వర్లు, సుభాష్, సుమిత్, సంజీవ్, రమేష్, వేణుగో పాల్, సత్తయ్య, ప్రభాకర్, శ్రీపతి బాపురావు, మల్లయ్య, దుర్గా ప్రసాద్, మూర్తి, రాజేశ్వర్, డిప్యూటి ఛైర్మన్‌లుగా రామ్మోహన్, సుధాకర్, వైస్ ఛైర్మన్‌లుగా మోహన్, రాజవేణు, బాపు, మనోజ్, జయకృష్ణ, గంగాధర్, రవీందర్, బాలకృష్ణ, రవికిరణ్, శ్రావణ్‌కుమార్, సునీత, గోపాల్, మోసిన్ అహ్మద్, వెంకటరమణ, ఫైనాన్స్ సెక్రటరీగా సతీష్‌కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా రామ్‌కుమార్, సెక్రటరీలుగా అజార్, తిరుపతి, వెంకటేశంలను ఎన్నుకున్నారు.


న్యాయాధికారి బాధ్యతల స్వీకరణ

లక్షెట్టిపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట న్యాయస్థానంలో గురువారం సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి ఇన్‌చార్జి జడ్జిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన న్యాయమూర్తి బదిలీ కావడంతో ఆయన స్థానంలో అదనపు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు తీసుకున్న జడ్జిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న న్యాయవాదు లతో కలిసి జడ్జికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధానకా ర్యదర్శి ప్రదీప్‌కుమార్, న్యాయవాదులు గాండ్ల సత్యనారాయణ, గడికొప్పుల కిరణ్ ఉన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కొంగల తిరుపతిరెడ్డి నియమితుల య్యారు. ఆయనను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గుర్రం మోహన్‌రెడ్డి గురువారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి, రెడ్డి కులబాంధవుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవీ కట్టబెట్టిన జిల్లా అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.

పేరుకుపోయిన సింగరేణి బకాయిలు



- ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో రూ. 40 వేల కోట్లు
- జెన్‌కో బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం
- గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కుదేలైన సంస్థ
- కాంగ్రెస్ ప్రభుత్వానిదీ అదే దారి
- యంత్రాల కొనుగోళ్లకూ డబ్బుల కొరత



మంచిర్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి ప్రభుత్వాలు బకాయి పడ్డ వేల కోట్ల రూపాయలు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వివిధ ప్రాంతాల్లోని విద్యుత్ ప్లాంట్లకు, ఇతర సంస్థలకు బొగ్గు, విద్యుత్ సరఫరా చేసిన బిల్లులు రూ. 40 వేల కోట్ల వరకు పెండింగులో ఉన్నాయి. తద్వారా సంస్థ ఆర్థిక కష్టాల్లో మగ్గాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సింగరేణిపై ఆధారిత పరిశ్ర మలు దక్షిణ భారత దేశంలో 4 వేల వరకు ఉంటా యి. ఆయా పరిశ్రమలకు కూడా సింగ రేణి బొగ్గు, విద్యుత్‌ను వినియోగించగా, ఆ సంస్థలు కూడా సింగరేణికి చెల్లించాల్సిన డబ్బులు మొత్తం చెల్లించలేదని తెలుస్తోంది. కర్నాటక, తమిళనాడు, కేరళ నుంచి కూడా విద్యుత్ సంస్థలకు బొగ్గు సరఫరా చేసిన డబ్బు సింగరేణికి రావాల్సి ఉండగా, అది కూడా నిలిచిపోయినట్లు సమాచారం.

బీఆర్ఎస్ హయాం నుంచే..

సింగరేణి సంస్థకు చెందిన వేల కోట్ల రూపాయల సొమ్ము అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ఖజానాకు మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించే ట్యాక్స్‌లే కాకుండా అదనంగా సంస్థ సొమ్మును ప్రభుత్వం వాడుకుంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కరోనా సమయంలో రూ. 40 కోట్లు సీఎం సహాయ నిధికి అందజేయగా, డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) నిధులు రూ. 2740 కోట్లు, హరితహారం కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్సార్) నిధులు సమారు రూ. 263 కోట్లను సంస్థ ప్రభుత్వానికి దారాదత్తం చేసినట్లు సమాచారం. ఇవిగాక నాలుగేళ్లుగా సింగరేణి తయారు చేసిన విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వరంగ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కోలకు విక్రయిస్తోంది. వాటి బిల్లులు వేల కోట్లలో పేరుకుపోయాయి. అలా బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణికి ప్రభుత్వం రూ. 27 వేల కోట్ల మేర బకాయిలు పడింది.

రూ. 40వేల కోట్లకు చేరుకున్న బకాయిలు..

ప్రభుత్వ నుంచి సుమారు రూ. 40వేల కోట్లు సిం గరేణికి రావాల్సి ఉంది. బీఆర్ఎస్ హయాంలో బకాయిపడ్డ రూ. 27వేల కోట్లతోపాటు కాంగ్రెస్ హయాంలోనూ మరో రూ. 13వేల కోట్ల మేర బకాయిలు పడ్డట్లు సమాచారం. ఎన్నికల సమయంలో సింగరేణి బకాయిలు..

(తరువాయి 5లో)

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీఆర్‌డీఏ



లక్ష్మీకాంతపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ, ఏఎంసీ ఛైర్మన్

దండేపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుక వచ్చి మద్దతు ధర పొందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి (డీఆర్‌డీఏ) కిషన్ సూచించారు. దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లక్ష్మీకాంతపూర్‌లో మార్కెట్ కమిటీ ఛైర్మన్ దాసరి ప్రేమ్ చందుతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఐకేపీ ఏపీఎం భూపతి బ్రహ్మయ్య, సీసీలు తిరుపతిగౌడ్, సురేందర్, వీవోఏలు, గ్రామైఖ్య సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టాన్ని ప్రతీ రైతు తెలుసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):భూసమస్యల పరి ష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం గురించి ప్రతి రైతు తెలుసుకోవాలని కలెక్టర్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టంలోని ప్రతి అంశాన్ని, హక్కును ప్రతి రైతు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఈ చట్టంలో హక్కులు, రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేస్తామన్నారు. సాదాబైనామా దరఖాస్తులకు కూడా పరిష్కారం ఉంటుందన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి సర్వే ప్రక్రియలో సంబంధిత సర్వేయర్లు, ఇతర అధికారుల నియామకంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామస్థాయిలోని సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టిని కేంద్రీకరించి పరిష్కరించే దిశగా చర్యలు చేపటామని, రైతులకు పట్టా భూమి,లావుని పట్టా, ఇతర రకాల భూములకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ ఆదేశాలు, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. టైటిల్, పొసెషన్ సంబంధిత సమస్య లు, కోర్టులో కొనసాగుతున్న కేసులను మినహాయించి మిగిలిన వాటి ని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావ ణ్ కుమార్, ఏవో సాయి ప్రశాంత్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాధవ రఘు నర్సింగరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయులు, ఎస్ఐ గంగారాం, అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణకు ఏర్పాట్లు పూర్తి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఉచితంగా అందించేందుకు టాస్క్ ద్వారా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సీ, సీ ప్లస్‌ప్లస్, జావా, పైథాన్, అప్టిట్యూడ్ రీజనింగ్, ఇంటర్వ్యూ నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తామన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలని, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 25లోగా తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 28న శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.

కిడ్నీ వ్యాధి బారిన పడడానికి ... కారణాలు తెలుసుకుంటున్నాం

ఆర్డీవో హరిక్రిష్ణ



మాట్లాడుతున్న ఆర్డీవో హరిక్రిష్ణ

బెల్లంపల్లి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మాలగురిజాల గ్రామంలో గ్రామస్థులు కిడ్నీ వ్యాధి భారిన పడడానికి గల కారణాలు తెలుసుకుంటున్నామని ఆర్డీవో హరిక్రిష్ణ అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో వైద్య, మిషన్‌భగీరథ అధికారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాల గురిజాల గ్రామంలో 269 మందికి రక్త పరీక్షలు నిర్వహించామని, సేకరించిన నమూనాలను టీహబ్‌కు తర లించామని తెలిపారు. కిడ్నీ వ్యాధి భారిన ఎందుకు పడుతున్నారనే విషయం తెలుస్తుందన్నారు. ప్రారం భంలో తాగునీటి సమస్యతో కిడ్నీ వ్యాధి భారిన పడడం లేదని సూచించారు. అలాగే గ్రామంలో 25 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని పేర్కొన్నారు. గ్రామంలో 269 మందికి కిడ్నీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించగా 17శాతం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని తెలిసిందన్నారు. ఆహార అలవాట్లు తాగు నీరుపై గ్రామస్థు లకు అవగాహన కల్పిస్తున్నామని, రక్తపరీక్ష ఫలితాలు రాగానే పూర్తి వివరాలు తెలుస్తాయని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యురాలు ఎంజెలీనా, మిషన్ భగీరథ రూరల్ డీఈ ప్రవీణ్ పాల్గొన్నారు.

మే డే పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం మే డే పోస్టర్లను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మే 1న 139 వ మేడే వేడుకలను కార్మిక వర్గం ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వాలు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల ను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. నాయకులు కలీందర్‌ఖాన్, దాగం మల్లేష్, సరస్వతి పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం మే డే పోస్టర్లను మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు విడుదల చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు దేవి సత్యం మాట్లాడుతూ మే 1న మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయం ఆవ రణలో నిర్వహించే మే డే సభలో పాల్గొని విజయవంతం చేయలని కోరారు.

వేసవిలో చేపల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వేసవి వాతావరణ పరిస్థితుల్లో చేపల పెంపకంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రత్తలు చేపల పెంపకాన్ని ప్రభావితం చేస్తాయని, జలశయాల్లో నీటి మట్టం క్రమేపి తగ్గుతుందని ఈ విషయంపై మత్స్యకార సంఘాలు, సభ్యులు జాగ్రత్త వహించాల న్నారు. చెరువులు, కుంటల్లో నీటి మట్టం తగ్గితే చేపల పట్టుకోవాలన్నారు. ఉదయం సమయంలో చెరువు పై భాగంలో చేపలు నోరు తెరుచుకుని తిరుగుతుంటే ప్రాణవాయువు కొరత ఉందని తెలుసుకుని చెరువులో నీరుపెట్టడం, పెద్దగా పెరిగిన చేపలను పట్టి విక్రయించాలని తద్వారా చేపల సాంద్రత తగ్గడం వల్ల ప్రాణవాయువు కొరతను అధిగమించవచ్చన్నారు. ప్రాణవాయువు కొరత ఏర్పడి చేపలు చనిపోయే ప్రమాదం ఉంటుందని, ఈ సందర్భంలో విషం కలిపారనే అపోహలను నమ్మకుండా నిజ నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. వ్యాధితో చేపలు చనిపోతే వాటిని నీటి నుంచి తీసి చెరువుకు దూరంగా కాల్చివేయాలన్నారు. జిల్లాలోని మత్స్య శాఖ పరిధిలోని 368 చెరువులు, కుంటల్లో చేపల రక్షణకు సూచనలు పాటించి రాబడి పొందాలని తెలిపారు.



భూ భారతితో సమస్యలు తీరేనా?



- ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే భూ వివాదాలు
- పరిష్కారం కోసం రైతుల ఎదురుచూపులు
- అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన భూ భారతి పోర్టల్ రాకతో జిల్లాలో భూ సమస్యలు తీరుతాయనే ఆశలు నెలకొన్నాయి. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ప్రవేశపెట్టినా భూ సంబంధిత సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో రైతులు ఏం చేయలేక ఏళ్ల తరబడి ఎదురు చూశారు.

గత నెల వరకు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంలో భూ సమస్యలపైనే చాలా మంది అర్జీలు ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే భూభారతి పోర్టల్‌ను ఏప్రిల్ 14న ప్రారంబించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరి ష్కారమే తమ ధ్యేయమని ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో జిల్లాలో భూభారతి పోర్టల్‌పై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

అప్పీళ్లకు అవకాశం..

గతంలో ఉన్న ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన భూ భారతిలో భూములకు సంబంధించిన వివాదాలపై ఆర్డీవో, కలెక్టర్‌లకు అప్పీళ్లు చేసుకునే అవకాశం కల్పించారు.

గతంలో భూములకు సంబంధించిన వివిధ సవరణల్లో కొన్నిం టిని మాత్రమే కలెక్టర్లు సవరించే అవకాశం ఉండేది ప్రస్తుతం ఆర్డీవో స్థాయిలో కొన్ని, కలెక్టర్ స్థాయిలో కొన్ని సమస్యలు పరిష్కరించే అవకాశం కల్పించారు. నూతనంగా తీసుకు వచ్చిన భూభారతి చట్టం 18 రాష్ట్రల్లోని రెవెన్యూ చట్టాలను పూర్తిగా అధ్యయనం చేసి తయారు చేశారు. భూ భారతి చట్టంపై అవగాహన కోసం ఈనెల 30 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పేరుకుపోయిన సమస్యలు..

జిల్లాలో భూ సమస్యలు ఏళ్ల తరబడి పేరుకుపోయాయి. జిల్లాలో సుమారు 4,50,000 ఎకరాల్లో పంటలు వేస్తున్నారు. సుమారు లక్ష 26 వేల మంది రైతులు పంటలు సాగు చేస్తు న్నారు. ధరణిలో ఎంతోమంది రైతుల భూము ల రికార్డులు ఇతరుల పేర్లపై ఆన్‌లై న్‌లో నమోదయ్యాయి. అసైన్డ్ భూములు, సాదా బైనామా కేసులు ఉన్న భూమి కంటే తక్కువగా భూమి ధరణిలో నమోదు ఆర్ఎఫ్ఆర్ లాంటి అనేక సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పనులు అక్కడే నిలిచి పోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో పట్టా భూములు అసైన్డ్ భూములుగా నమోదు కావడం, సాదా బైనామా భూములు ఒకరి భూమి మరొ కరి పేరుపై నమోదు వ్యవసాయ భూములు అబాదిగా నమో దు, భూ విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు లాంటి సమస్యలను రైతులు ప్రధా నంగా ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా సమస్యలు తీరుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు.

భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు

రెడ్డిమల్ల తిరుపతి, సింగరేణి పర్సనల్ మేనేజర్



ఆంధ్రజ్యోతి: బెల్లంపల్లి ఏరియాలో భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

పర్సనల్ మేనేజర్: బెల్లంపల్లి ఏరియాలో భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 153 మంది భూ నిర్వాసితులను గుర్తించాం. ఇందులో 134 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. ఇంకా 19 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి: బెల్లంపల్లి ఏరియా నుంచి ఇప్పటి వరకు మెడికల్ బోర్డుకు ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు?

పర్సనల్ మేనేజర్: బెల్లంపల్లి ఏరియా నుంచి ఇప్పటి వరకు 705 మంది కార్మికులు మెడికల్ బోర్డుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 401 మంది కార్మికులు మెడిక్ అన్‌ఫిట్ అయ్యారు. 340 మందికి వారసత్వ ఉద్యోగాలు కల్పించాం. మిగితా వారికి కూడా త్వరలోనే ఉద్యోగం కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: బెల్లంపల్లి ఏరియాలో గృహ రుణాల కోసం ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు?

పర్సనల్ మేనేజర్: బెల్లంపల్లి ఏరియాలో గృహ రుణాల కోసం 355 మంది రదఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 351 మందికి దరఖాస్తులను ఆమోదించాం. ఇప్పటికే 172 మంది కార్మికులకు రుణాలు మంజూరయ్యాయి.

ఆంధ్రజ్యోతి: బెల్లంపల్లి ఏరియాలోని నిరుద్యోగ యువతీయువకులకు ఎలాంటి ప్రోత్సాహం అందిస్తున్నారు?

పర్సనల్ మేనేజర్: బెల్లంపల్లి ఏరియాలో నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలో ప్రోత్సాహిస్తున్నాం. ముఖ్యంగా స్వయం ఉపాధి పథకాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. పోటీ పరీక్షలకు హాజరవుతున్న వారికి లైబ్రేరి ద్వారా మెటీరియల్ అందిస్తున్నాం.

- రెబ్బెన, ఆంధ్రజ్యోతి

ప్రాణం తీసిన ఫోన్‌కాల్

- కళాశాల భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య
- వాచ్‌మన్, కళాశాల యాజమాన్యం కారణమని కుటుంబ సభ్యుల, విద్యార్థి సంఘాల ఆందోళన
- అదనపు కలెక్టర్ జోక్యంతో విరమణ



లక్ష్మిప్రసన్న (ఫైల్)

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఒకే ఒక్క ఫోన్ కాల్ ఒక విద్యార్థిని ప్రాణాలను బలి తీసుకుంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా కళాశాలలో భీమిని మండలానికి చెందిన డిగ్రీ విద్యార్థిని లక్ష్మిప్రసన్న (19) భవనంపై నుంచి దూకి గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ నెల 23వ తేదీ రాత్రి 9 గంటలకు లక్ష్మి ప్రసన్న కళాశాల వాచ్‌మన్ ఫోన్ ద్వారా తన చిన్నమ్మ కొడుకు వెంకటేశ్‌కు ఫోన్ చేసింది. అనంతరం వెంకటేశ్ వాచ్‌మన్‌కు ఫోన్ చేసి రాత్రి సమయంలో ఫోన్ ఎందుకు ఇచ్చావంటూ బెదిరించాడు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ మేనేజర్‌కు సైతం వెంకటేశ్ ఫోన్ చేసి రాత్రి సమయంలో ఫోన్ ఎందుకు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మేనేజర్ వాచ్‌మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధుల నుంచి తొలగిస్తానని హెచ్చరించాడు. వాచ్‌మన్ మహేశ్ లక్ష్మి ప్రసన్న వద్దకు వెళ్లి తన ఉద్యోగం పోతే ఎలా అంటూ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయం కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి వెళ్లిందని తెలియడంతో లక్ష్మి ప్రసన్న తీవ్ర ఒత్తిడికి గురైంది. గురువారం ఉదయం కళాశాల భవనం నాలుగో అంతస్తు పైకి ఎక్కి అక్కడి నుంచి దూకింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో గమనించిన సిబ్బంది వెంటనే ఆమెను మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కళాశాల సిబ్బంబది వేధింపుల వల్లనే లక్ష్మి ప్రసన్న ఆత్మహత్యకు పాల్ప డిందని కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు.

కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

లక్ష్మీ ప్రసన్న మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారిని ఆర్థికంగా అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘం నాయకులు ఆసుపత్రి ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. కుటుంబానికి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్‌గౌడ్‌తో పాటు బీజేపీ నాయకులు ఆందోళనకు దిగడంతో అదనపు కలెక్టర్ మోతిలాల్ సంఘటనాస్థలానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను విరమింప చేసే ప్రయత్నం చేశారు. విద్యార్థిని తండ్రి జంగంపల్లిగో పాల్ తల్లి నాగమ్మ దంపతులు కలెక్టర్ కాళ్లమీదపడి రోదించారు. కలెక్టర్ న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని స్వగ్రామమైన జగ్గయ్యపేటకు తరలించారు.

వడదెబ్బతో యువకుడి మృతి

పెంచికలపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా పెంచికలపేట మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన లొంకర్ ప్రభాకర్(24) అనే యువకుడు వడదెబ్బతో మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో దహెగాంలో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లాడు. అక్క వాళ్లతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న కొంత సమయం తరువాత ఎండ తీవ్రతకు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రభాకర్ మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తరలించారు.ఈ విషయమై తహసీల్దార్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

పహల్గాం మృతులకు నివాళి



బెజ్జూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీరులోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ఆత్మశాంతి కలుగాలనిగురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, సీఐలు, ఎస్సైలు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి, శంకర్, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పూర్తి పారదర్శకంగా చేయలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని పరిశీలించాలని చెప్పారు. పోక్సో గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతీ అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్ స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులోపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దివగా అన్ని స్థాయిల అధికారులు పని చేయా లని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్ధవంతమైన సేవలు అందజేస్తూ సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలలో సీసీ టీవీల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అనంతరం విధులలో ఉత్తమ ప్రతిభ చాటిన ఆసిఫాబాద్ సీఐ రవీందర్, ఆసిఫాబాద్ ఎస్సై అంజన్న, ఆసిఫాబాద్ కానిస్టేబుళ్లు సాగర్, తిరుపతిలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రాణా ప్రతాప్, శ్రీధర్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురికి జైలు శిక్ష

కెరమెరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలానికి చెందిన నలుగురు వ్యక్తులకు గంజాయి కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం డిస్ట్రిక్ సెషన్స్ కోర్టు ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. 2021 మే 31న అప్పటి ఎస్సై రమేష్ సావర్‌ఖేడ గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా కారులో గంజాయి లభించింది. కారు నడుపుతున్నవ్యక్తి గుడిహత్నూర్‌కు చెందిన పుస్నాక్ రవీందర్, గుర్నులె శ్రీరామ్‌లు పట్టుబడ్డారు. ఈ విషయంలో విచారణ చేపట్టగా సావర్‌ఖేడ గ్రామంలోని ఆదె తుకారాం వద్ద కిలో, వాడాయి బిక్కు వద్ద కిలో గంజాయిని కొనుగోలు చేశామని, దీనికి శ్రీరామ్ మధ్యవర్తిగా వ్యవహరించినట్లు రవీందర్ ఒప్పుకున్నాడు. విచారణ కోసం వెంటనే సావర్‌ఖేడ గ్రామంలోని తనిఖీ చేయగా తుకారాం ఇంటి వద్ద 47 కిలోల గంజాయి, బిక్కు ఇంటి వద్ద నాలుగు కిలోల గంజాయి లభ్యం కావడంతో అప్పటికే ఎస్సై రమేశ్ కేసు నమోదు చేశారు. రెండో సారి వాంకిడి సీఐ సుధాకర్‌లు విచారణ జరపగా ప్రస్తుత వాంకిడి సీఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్సై మధుకర్ సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. పీపీ జగన్మోహన్‌రావు, ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ విచారణ జరపగా నేరం చేసినట్లు రుజువు కావడంతో నిందితులు రవీందర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా, శ్రీరామ్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించారు.- తుకారాంకు పదేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా, వడాయి బిక్కుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్మోహన్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్, లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్‌ను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

బాల్య వివాహలు చేయకుండా చర్యలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహలు చేయకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, బాలల సంరక్షణాధికారి మహేష్ అన్నారు. న్యూఢిల్లీ నుంచి జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



సింగరేణి సమాచారం

సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



కారుణ్య నియామకపత్రం అందజేస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న యువతీ, యువకులు సింగరేణి అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. మెడికల్ ఇన్వాడిలేషన్ కింద డిపెండెంట్లకు గురువారం నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కొత్తగా చ ఏరిన వారు సర్ఫేస్‌లో విధులు కావాలన ఇపైరవీలు చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. ఇప్పటి వరకు మందమర్రిలో 1,973 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ఆయా విధులకు సంబంధించి యాక్టింగ్ చేసే వారికి 193 మస్టర్లు నిండితే పదోన్నతులు వస్తాయని తెలిపారు. . కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న వారు ఐదు సంవత్సరాల వరకు అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వహించిన తర్వాతే సర్ఫేస్‌లో అవకాశాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు రమణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాన్ని సందర్శించిన అధికారి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మందమర్రి జీఎం కార్యాలయాన్ని గురువారం కార్పోరేట్ జీఎం (ఎంపీ మెటీరిల్ ప్రొక్యూర్‌మెంట్) అధికారి మల్లెల సుబ్బారావు సందర్శించారు. అధికారులను, స్థానిక జీఎంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీఎం దేవేందర్ మాట్లాడుతూ ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న సుబ్బారావు సింగరేణి సంస్థకు చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం సుబ్బారావును శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా సేఫ్టీ అధికారి రవీందర్, పీఎం శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి ఉద్యోగులు పాల్గొనాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మే 20న నిర్వహించే ఒక్కరోజు సమ్మెలో సింగరేణి ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్, నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించి వాటిని అమలు చేసేందుకు పూనుకుందన్నారు. దీనివల్ల కార్మికులు తమ హక్కులు, ఉద్యోగాలు కోల్పోతారని, వారి ఉపాధికి భరోసా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నట్లు చెప్పారు. దీనికి ఇటీవల వచ్చిన సర్క్యులర్లే నిదర్శమని ఆయన పేర్కొన్నారు. కానీ ఓ కార్మిక సంఘం తామే అన్ని చేసినట్లు అబద్ధపు ప్రచారం చేసుకుంటోందని దుయ్యబట్టారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. తమ యూనియన్ డిమాండ్ మేరకే య్రైటింక్లయిన్ కాలనీలో సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభం కావాలని, త్వరలో అన్ని సింగరేణి పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని కోరారు. ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతామని ఆయన హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాలలో ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, నాయకులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య గొల్లపల్లి రాంచందర్, అఫ్రోజ్‌ఖాన్, దొడ్డిపట్ల రవీందర్, నర్సింగరావు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్(మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్)గా పనిచేస్తూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న మల్లెల సుబ్బారావును ఉద్యోగులు, యూనియన్ నాయకులు సన్మానించారు. అనంతరం జీఎం ఎం శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సుబ్బారావు గత 42 ఏళ్లుగా సింగరేణి సంస్థకు సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, స్వామి, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణా శిబిరాలు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు బాల, బాలికలకు వివిధ క్రీడాంశాలలో శనివారం నుంచి వచ్చే నెల 20వతేదీ వరకు వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుట్‌బాల్, అథ్లెటిక్స్‌లో 25 మంది చొప్పున, బాక్సింగ్, బాస్కెట్ బాల్, వాలీబాల్ 20 మంది చొప్పున అవకాశం ఉందన్నారు. ప్రాణహిత స్టేడియం (న్యూనాగార్జునకాలనీ), ప్రగతి స్టేడియం(శ్రీరాంపూర్‌కాలనీ), సేవాభవన్ గ్రౌండ్ (నస్పూర్‌కాలనీ)లలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కోచింగ్ నిర్వహించే క్రీడా ప్రాంగణంలో నిర్వాహకుల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

శిక్షకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వివిధ క్రీడాంశాలలో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం (పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణికి చెందిన సీనియర్ క్రీడాకారులు, స్థానిక పీఈటీలు, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు తమ దరఖాస్తులను శుక్రవారం సాయంత్రం ఐదు గంటల్లోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో అందించాలని కోరారు. ప్రతి శిక్షకుడికి 25 రోజుల కాలానికి రూ. 3400ల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



ఉమ(ఫైల్)

వాంకిడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వ ంండ లంలోని బంబార గ్రామ సమీపం లోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నాగుల ఉమ(50) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బంబార గ్రామానికి చెందిన నాగుల విలాస్ అతని భార్య ఉమ ద్విచక్ర వాహనంపై వివాహ వేడుకలకు వెళ్లారు. తిరిగి బంబారకు వస్తుండగా జాతీయ రహదారి మూలమలుపు వద్ద వెనక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం డీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం చంద్రాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉమ మృతి చెందింది.

బోయవాడలో చోరీ

నెన్నెల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన జంబిశెట్టి పోసాని అనే కూలి ఇంట్లో గురువారం ఉదయం చోరీ జరిగిందని ఎస్సై ప్రసాద్ తెలిపారు. రూ. 83 వేల నగదు, తులం బంగారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారని చెప్పారు. కూలి పనికి వెళ్లి జమ చేసుకున్న నగుదుతో పాటు బంగారం ఇంట్లోని ట్రంకుపెట్టెలో దాచుకున్నదన్నారు. ట్రంకుపెట్టె తాళం తొలగించి బంగారం, నగదు తీసుకెళ్లారని తెలిపారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి పెట్టెను చూసి దొంగతనం జరిగినట్టు గుర్తించి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించామని ఎస్సై తెలిపారు.

పేరుకుపోయిన సింగరేణి బకాయిలు..

(3వ పేజీ తరువాయి)

చెల్లించడం ద్వారా సంస్థ అభివృద్ధికి సహకరిస్తామన్న కాంగ్రెస్...అధికారంలోకి వచ్చాక తనవంతు బకాయిలు కూడా జమ చేయక పోవడం గమనార్హం. ప్రభుత్వాల వద్ద వేల కోట్లు పెండింగులో ఉండటంతో సంస్థ బొగ్గు తవ్వకాల కోసం ఉపయోగించే భారీ వాహనాలైన షావల్, డోజర్, తదితర వాహనాలను కొనుగోలు చేయలేక ఓసీల్లో ఉత్పత్తిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తోంది. కాంట్రాక్టీకరణ వల్ల కూడా సంస్థపై ఆర్థిక భారం పడుతున్నట్లు కార్మికులు చెబుతున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన తన హయాంలో బకాయిపడ్డ సొమ్ము చెల్లిస్తే సంస్థ అభివృద్ధికి తోడ్పాటు నందించినట్లవు తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బకాయిలు వెంటనే చెల్లించాలి....

ఏఐటీయూసీ అధ్యక్షులు, వాసిరెడ్డి సీతారామయ్య



రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి పడ్డ సుమారు రూ. 40వేల కోట్లను వెంటనే చెల్లించాలి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల సంస్థ అభివృద్ధికి అడ్డంకిగా మారుతోంది. బొగ్గు తవ్వకాలు జరిపేందుకు వినియోగించే భారీ వాహనాలు కొనుగోలు చేసేందుకు యాజమాన్యం పునరాలోచించాల్సిన పరిస్థితి ఉంది. గత ప్రభుత్వంలో దాదాపు రూ. 27 కోట్ల బకాయిలు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తూ రూ. 13వేల కోట్ల బకాయిలు పడింది.

నీటి సమస్య లేకుండా చూడాలి

వేమనపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామల్లో నీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీపనులను ముమ్మరంగా చేపట్టాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు


ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

నస్పూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రకటించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో అత్యంత ప్రతిభ చూపిన రేడియంట్ హైస్కూల్ పూర్వ విద్యార్థులను గురువారం ఆ పాఠశాలలో యాజమాన్యం ఘనంగా సత్కరించింది. టి. అశ్విని ఎంఇసీలో 495/500 మార్కులు, ఎం. అక్షిత రెడ్డి ఎంపీసీలో 465/470, జే. అక్షయగౌడ్ బైపీసీలో 434/440 మార్కులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ అమన్ ప్రసాద్, ప్రిన్సిపల్ రజనీ తెలిపారు. విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్ల రద్దుకు పోరాడుదాం

బెల్లంపల్లి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల రద్దుకు పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. గురువారం నాయకులతో కలిసి మేడే పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అధిపతులకు వత్తాసు పలుకుతూ కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను ప్రవేశపెట్టి ఎంతో మంది కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు వెంకటి, లింగన్న, కొమురన్న, పద్మ, క్రిష్ణవేణి, కరుణ పాల్గొన్నారు.

గొంతెండుతోంది..



బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ఎదుట వాటర్‌ట్యాంక్

- బెల్లంపల్లి మున్సిపాలిటిలో తీవ్రమవుతున్న తాగునీటి సమస్య
- వారంలో ఒకటి లేదా రెండు రోజులే సరఫరా
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బెల్లంపల్లి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మున్సిపాలిటిలో నీటి ఎద్దడి వేధిస్తోంది. ప్రతిరోజు నీటి సరఫరా చేయాల్సిన అధికారులు వారంలో ఒకటి లేదా రెండు రోజులే సరఫరా సరఫరా చేయడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండుటెండల్లో ఖాళీ బిందెలతో నీటి కోసం మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది. అధికారులు వేసవిలో నీటి ఎద్దటి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతు న్నామని చెబుతున్నా అది వాస్తవరూపం దాల్చడంలేదు. తాగునీటి కోసం పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు నీటి ఎద్దటి లేకుండా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళిక లేమితో కష్టాలు..

పట్టణంలో ప్రతి ఏటా వేసవిలో సంబంధిత అధికారుల ప్రణాళిక లేమితోనే ప్రజలు తాగునీటి ఇబ్బందులకు గురవుతున్నారు. నీటిని సరఫరాచేసే పవర్ బోర్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతోనే అది తరుచుగా మొరాయిస్తుండడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పవర్‌బోర్డులు పని చేయని సమయంలో వాటిని మరమ్మతు చేయడంలో మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు న్నాయి.

దశాబ్దాలుగా గోదావరినీటి కోసం ఎదురు చూపులు..

బెల్లంపల్లి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడం కోసం 2011లో గోదావరినీటి పథకాన్ని ప్రతిపాదించారు. ఇందుకు అప్పటి ప్రభుత్వం రూ.18కోట్ల నిధులతో ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి గోదా వరి తాగునీటి పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా గోదా వరినీటి కోసం పట్టణం కోసం రైల్వే స్టేషన్ ముందు ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో పాటు ఫిల్టర్ బెడ్‌ను నిర్మించారు. 2014లో పనులు పూర్తయ్యాయి. ట్రయల్‌రన్ నిర్వహించిన సమయంలో ఎల్లంపల్లి నుంచి మందమర్రి మధ్య చాలా చోట్ల పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడ్డాయి. అనంతరం కొన్ని సార్లు మరమ్మతులు చేపట్టినా పూర్తి స్థాయిలో విజయవంతం కాక పోవడంతో ఫిల్టర్‌బెడ్‌కు నీటిసరఫరా కాలేదు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గోదావరినీటి పథకాన్ని పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద మున్సిపాలిటిలో రూ.31 కోట్లతో మిషన్‌భగీరథ పనులను నాలుగేళ్ల క్రితం పూర్తిచేశారు. పట్టణ ప్రజలు నీటి సరఫరా కోసం మూడు వాటర్‌హెడ్ ట్యాంక్‌లతో పాటు ప్రతి వార్డులో అంతర్గత పైప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు.

కొమురంభీం, ఆసిఫాబాద్ జిల్లాలోని అడా ప్రాజెక్టు ద్వారా బెల్లంపల్లి పట్టణ ప్రజలకు మంచినీరును అందిస్తున్నారు. అడా ప్రాజెక్టు నుంచి ప్రతి రోజు నీటి సరఫరా కాకపోవడంతో గతంలో నాలుగైదు రోజులకో సారి నీరు సరఫరా చేశారు. ఇప్పుడు మిషన్ భగీరథ నీరు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గోదావరినీటిని అందించేందుకు ఎల్లంపల్లి, బెల్లంపల్లి పథకాన్ని పునరుద్ధరించేందుకు అమృత్ పథకంలో భాగంగా రూ.61 కోట్ల నిధులతో ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి గోదావరి నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ పనులు పూర్తి కాకపోవడంతో ఇటు గోదావరి జలాలు రాక అటు అడా ప్రాజెక్టు నుంచి నీళ్లు రాక పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

తాగునీరు సరిగ్గా రావడం లేదు..

పెంటమ్మ, బెల్లంపల్లి



తాగు నీరు సరిగ్గా రావడం లేదు. వారంలో రెండు రోజులు ఇచ్చే నీరు సరిపోవడం లేదు. దీంతో ఎండలో బిందెలతో దూరంలో ఉన్న పంపు వద్దకు వెళ్లి నీళ్లు మోసుకుంటున్నాం. నీళ్లు వస్తలేవని అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

సెప్టెంబరు వరకు శాశ్వత పరిష్కారం

మున్సిపల్ డీఈ సాయికిరణ్

అడా ప్రాజెక్టు నుంచి పట్టణ ప్రజలకు సరి పడా నీళ్లు రావడం లేదు. ప్రతి రోజు 6 ఎండీల నీరు అవసరం ఉండగా 4.2ఎండీల నీరు మాత్రమే వస్తుంది. దీంతో పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బంది ఎదురవుతోంది. అమృత్ 2.0లో భాగంగా ఎల్లంపల్లి టు బెల్లంపల్లి గోదావరి నీటి సరఫరా పనులు 7కిలోమీటర్ల వరకు పూర్తయ్యాయి. సెప్టెంబర్ వరకు పూర్తి స్థాయిలో పనులు పూర్తవుతాయి. దీంతో నీటి సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.



వారంలో ఒకటి లేదా రెండు రోజులే సరఫరా..

బెల్లంపల్లి పట్టణంలో దాదాపు 60వేలకు పైగా జనాభా ఉంది. మొత్తం 34వార్డులు ఉన్నాయి. మున్సిపల్ నల్లా కనెక్షన్‌లు 11600, సింగరేణి నల్లా కనెక్షన్‌లు 4వేలు, చేతి పంపులు 328, పవర్ బోర్డులు 11, ఆరు వాటర్ ట్యాంక్‌లున్నాయి. 34 వార్డుల్లోని ప్రజలకు మిషన్ భగీరథ నీటితో పాటు సింగరేణి గోదావరినీటిని అందిస్తోంది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అడా ప్రాజెక్టు నుంచి పట్టణ ప్రజలకు నీటి సరఫరా అవుతుంది. అలాగే గోదావరి నీరు మంద మర్రి ఫిల్టర్ బెడ్ నుంచి బెల్లంపల్లిలోని శాంతిఖని గని ఫిల్టర్ బెడ్‌ద్వారా నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. మిషన్ భగీరథతో పాటు గోదావరి నీరు ప్రతి రోజు నీటి సరఫరా చేయాల్సి ఉన్నా సరఫరా కావడం లేదు.

పట్టణ ప్రజలకు వారంలో ఒకటి లేదా రెండు రోజులు తాగు నీరు రాకపోవడంతో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్న చేతి పంపుల వద్దకు బోరుబావుల వద్దకు వెళ్లి మండుటెండల్లో నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. నీటి సరఫరా లేని సమయంలో మున్సిపల్ శాఖ అధికారులు కనీసం ట్యాంకర్ల ద్వారా కూడ నీటిని సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



బెల్లంపల్లిలో ఖాళీ బిందెలతో చేతి పంపు వద్దకు వెళ్తున్న మహిళలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వేమనపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుయ్యారం, జిల్లెడ, ముల్కలపేట, కేతనపల్లి, నీల్వాయి, దస్నాపూర్, నాగారం, సూరారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురు వారం మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మిమోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, తాగునీటి తదితర సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాబీర్ అలీ, లింగాగౌడ్, సత్యనారాయణ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, బైరి సత్యనారాయణ, పురుషోత్తం, మధు, పోశం, రమేష్, దుర్గయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటిక పట్టివేత

బెల్లంపల్లి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కారులో రవాణ చేస్తున్న బెల్లం, పటికను పట్టుకున్నట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సయిజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. విలేకరుల ముసుగులో కొన్ని నెలలుగా గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన రాజుకుమార్, సంజు, చందులు కారుకు ప్రెస్ స్టిక్కర్ అందించి బెల్లం, పటిక రవాణ చేస్తున్నారన్నారు. సమాచారం మేరకు ఐబీ తాండూర్ ఫ్లైఓవర్ వద్ద కారును ఆపి తనిఖీ చేయగా 216కిలోల బెల్లం, 30 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే టాటా ఇండికా కారుతోపాటు రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సాగర్, ప్రశాంత్, కవితలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాసిపేట: మండలంలోని అర్హులైన 11 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని 11 మంది లబ్దిదారు లకు చెక్కులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ తెలిపారు.

జన్నారం : ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షులు భూమేష్, ఉపాధ్యక్షుడు చిన్నయ్య, కార్యదర్శిగా రాజశేఖర్‌లను గురువారం తిమ్మాపూర్ పంచాయతీలో మాజీ సర్పంచు జాడి గంగాధర్ ఘనంగా శాలువాలతో సన్మానించారు.

బెల్లంపల్లి: జమ్మూకాశ్మీర్‌లో భారతీయులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా గురువారం బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి విధులు బహిష్కరించారు. పలువురు మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్, ప్రధాన కార్యదర్శి చేను రవికుమార్, న్యాయవాదులు గోపికిషన్ సింగ్, సురేశ్ పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని పెద్దాపూర్ కొలాం గూడలో పోలకమ్మ బుర్రిదేవత పూజలను కొలాం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. పాడిపంటలు పశుసంపద అభివృద్ధి చెంది పిల్లా పాపలను ఏడాదిపాటు చల్లంగా కాపాడాలని కోరుతూ బుర్రిదేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ వాయిద్యాలతో ఆటపాటలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆత్రం మహేశ్, బొజ్జిరావు, టేకం మెంగు, భీంరావు, రాజు, గంగారాం, భగవంత్‌రావు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని మామి డిగట్టు గ్రామానికి చెందిన కొత్తపల్లి రాజక్క కుటుంబానికి గురువారం ప్రజా వెల్ఫేర్ సొ సైటీ సభ్యులు నిత్యవసర సరుకులు, బియ్యం అందజేశారు. జాన్విరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వారి తరుపున సరుకులు అందించామని సొసైటి ఉపాధ్యక్షుడు ప్రభుదేవ, జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజ్‌కుమార్‌లు తెలిపారు.

● గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో సత్యనారాయణ సూచించారు. గురువారం మండలంలోని పొన్నారం గ్రామంలో పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. స్పెషల్ ఆఫీసర్ అనిత, కార్యదర్శి హరీష్, నాయకులు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

లక్షెట్టిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో పర్యాటకులపై తీవ్రవాదులు చేసిన దాడికి నిరసనగా లక్షెట్టిపేట న్యాయస్థానంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న మాట్లాడుతూ పహల్గావ్‌లో అమాయకపు పర్యాటకులపై దాడి చాలా అమానుశం అన్నారు. ఈదాడికి భారత్ ధీటైన సమాధానం ఇస్తుందని ఈలాంటి దాడులను భారత్ భారత్ ఎట్టి పరిస్థితుల్లో సహించదన్నారు. ఈకార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్, మాజీ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు నళినికాంత్, సీనియర్ న్యాయ వాదులు రాజేశ్వర్‌రావు, సురేందర్, శ్రీధర్, న్యాయవాదులు పద్మ, సంతోష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గర్మిళ్ల : పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా గురువారం మంచిర్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు. మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేసన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.





లక్షెట్టిపేటలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు..మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కొవ్వొత్తుల ర్యాలీ

● పెహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు లో బీఆర్‌ఎస్ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వ హించారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూ రాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు : జమ్ముకాశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా చెన్నూరు మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసనవ్యక్తం చేశారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. యువకుడి మృతి



జంగుబాబు(ఫైల్)

జన్నారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలంలోని కొమ్ముగూడెం గ్రా మ సమీపంలో గురువారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలానికి చెందిన ఫిజియోథెరపి డాక్టర్ ఉర్మెత జంగుబాబు (30) అక్కడికక్కడే మృతిచెందినట్లు జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ఒక వివాహానికి హాజరైన జంగుబాబు తన బైక్‌పై కల మడుగు గ్రామం నుంచి జన్నారం వైపు వస్తున్నాడు. ఇందనపల్లి గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. వైద్యుడు జంగుబాబుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

భీమారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ధరావత్ శ్రీధర్ రోడ్డు ప్రమా దంలో మృతిచెందగా గురువారం రూ. 2 లక్షల బీఆర్‌ఎస్ పార్టీ ప్రమాద బీమా చెక్కును బీఆర్‌ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ డాక్టర్ రా జా రామేష్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలగూర రాజ్‌కుమార్, మదునయ్యలు రాము, వెంకన్న, లాజర్, రమేష్‌గౌడ్, రాజ్‌కుమార్‌నాయక్ గోపాల్, చంద్రమైళి, బలరాం నాయక్, శ్రీనివాస్‌నాయక్, రాజు, లక్ష్మీనవీన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే భూభారతి చట్టం

కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమిని, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భూసమస్యలు పరిష్కరించడమే లక్ష్యగా భూభారతి చట్టం రూపొందించారని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద భూభారతి అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ చట్టం లో పొందుపరిచిన అంశాలు, హక్కులపై ప్రతీ ఒక్క రైతుకు అవగాహన కలిగిఉండాలన్నారు. భూభారతి ద్వారా భూసంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తందన్నారు. అనంతరం చిన్నగుడిపేట గ్రామానికి చెందిన కుకట్ల శేయ ఇంటర్‌లో 985 మార్కులు సాధించినం దుకు గానూ షాలువా కప్పి సన్మానించారు. అదనపు కలెక్టరు మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ బికర్ణ దాస్, ఎంపీడీవో గంగమోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, మాజీ పీఏ సీఎస్ చైర్మన్ రవీందర్‌రావు, డీటీ గోవర్ధన్, వెంకటేష్, కొమురయ్య పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాలలోని అసోసియేషన్ కార్యాలయంలో పోస్టాఫీసు ప్రమాద బీమా పథకాల గురించి చాంబర్ ఆఫ్ సెక్రటరీ ఇరుకుల్ల శ్రీనివాస్ అవగాహన కల్పించారు. వ్యాపారులు, వారు పనిచేసే సంస్థల్లో పనిచేసే ఉద్యోగులతో బీమా పాలసీలను చేయించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సుధాకర్, సెక్రటరీ శ్రీనివాస్, జుగల్ కిశోర్ వ్యాస్, సుధాకర్, భాస్కర్ ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న డీఎల్‌పీవో ధర్మారాణి

జైపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రజల సహకారం ఎంతో అవసరమని డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మారాణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఇందారం గ్రామ పంచాయతీలో నేషనల్ పంచాయతీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలకు ఆమె హాజరై మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో చెత్తా, చెదారం , ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇందారం గ్రామపంచాయతీలో పారిశుధ్యం, ఇంటి పన్ను బకాయిల్లో ఇందారం ముందుదన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి కేక్ కట్ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి సుమన్, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్లు కళ్యాణి, సౌజన్య పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక గ్రామసభను మండల ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పంచాయతీ రాజ్ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ మాట్లాడారు.

అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీవో సప్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

చేనేని భీమయ్యకు నివాళి

కాసిపేట, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): పోలీసు కాల్పుల్లో అసువులు బాసిన అమరుడు చేనేని భీమయ్య 37వ వర్ధంతి వేడుకలను ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మద్దిమాడలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు మాట్లాడుతూ అటవి సంపదపై ఆదివాసీలకే పూర్తి హక్కులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మద్దిమాడలో కమ్యూనిటి హాలు నిర్మించి మృతుడు చేనేని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమానికి ముందుగా నాయకపోడ్ సాంప్రదాయం ప్రకారం పూజలు చేసి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాం గ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్, బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు రమణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, మాజీ జడ్పీటీసీ చంద్రయ్య, మాజీ సర్పంచ్ జంగు, నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు రాజన్న పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న నాయకులు

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి

తాండూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం మండలంలోని చౌటపల్లి గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, సెగ్రిగేషన్ షెడ్డులో కంపోస్టు ఎరువుతను తయారు చేయాలన్నారు. డివిజనల్‌పంచాయతీ అధికారి షేక్ సప్దర్ అలీ, ఎంపీవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వసంత, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సులో పోగొట్టుకున్న సర్టిఫికెట్లు అందజేత

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బస్సులో ఓ మహిళ పోగొట్టుకున్న సర్టిఫికెట్లను గురువారం డ్రైవర్ అందజేశారు. ఆసిఫాబాద్ డిపోకు చెందిన బస్సు కౌటాల నుంచి హైదరాబాద్ బస్సులో ప్రయాణించిన ఓ మహిళా తన ఒర్జినల్ సర్టిఫికెట్లు, పాసుపోర్టు బస్సులోనే మర్చిపోయింది. హైదరాబాద్‌లో బస్సు దిగిన అనంతరం ఆమె తన సర్టిఫికెట్లు బస్సులో మరిచిపోయిన విషయాన్ని గుర్తించి వెంటనే బస్సు నంబర్, డ్రైవర్ వివరాలు సేకరించి ఆయనను సంప్రదించింది. దీంతో డ్రైవర్ సర్టిఫికెట్లను సురక్షితంగా భద్రపరిచి ఆమెకు తిరిగి అందజేశారు.

రేపు జాబ్‌మేళా

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని టాస్క్ సెంటర్‌లో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ గురువారం ఒక ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌లో 30, హైదరాబాద్ శ్రీ విజయ బయో ఫర్టిలైజర్ ప్రైవేట్ లిమిటెడ్ లో 50 పోస్టుల భర్తీకి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

కెరమెరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, రాజీవ్ యువ వికాస కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా వెనకబడి ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం ప్రవేశ పెట్టిందని చెప్పారు. కార్యక్ర మంలో ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్‌రావు, కార్యదర్శులు, బ్యాంకు మేనేజర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడు?

- అమలుకు నోచుకోని ప్రభుత్వ హామీ
- దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా కలగని మోక్షం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో నిరాశ



పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న వృద్ధులు(ఫైల్)



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్ వృద్ధులకు 4వేలు, దివ్యాంగు లకు 6వేలు రూపాయలు, కొత్త దరఖాస్తుదారులు తమకు ఎప్పడు మంజూరు చేస్తారని ఆశగా వేచిచూ స్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఇప్పటి వరకు దీనిపై స్పష్టత ఇవ్వక పోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు.

చింతలమానేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పొందుతున్న ఆసరా పింఛన్లను పెంచ డంతో పాటు కొత్తవారికి మంజూరు చేస్తామని ఎన్ని కలకు ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అమలులో జాప్యం చేస్తుండడంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తులు అందజేసి నెలలు గడుస్తు న్నా ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వడం లేదని వాపోతున్నారు. అవి ఇప్పుడు ఏ దశలో ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదా రులు తమకు ఎప్పుడు మంజూరవుతాయని సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు దాటినా ఆసరా పింఛన్ల పెంపుపై ప్రకటన చేయకపోవడంతో లబ్ధిదారుల్లో అసంతృప్తి నెలకొంది.

● రెండేళ్లుగా మంజూరుపై..

రెండేళ్లగా పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రావడం లేదు. గతంలో ప్రతీ నెలా కొత్త పింఛన్లు అమలు చేసే విధానం ఉండేది. గత ఏడాది అక్టోబరులోనే నూతన పింఛన్ విధానం మొద లవుతుందని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. భార్యాభర్తల్లో ఎవరైనా ఒకరు ఆసరా పింఛన్ పొందుతూ చనిపోతే ఆ పిం ఛన్‌ను భాగస్వామికి బదిలీ చేస్తున్నారు. గత సంవ త్సరం నుంచి స్పౌజ్ పింఛన్ల ప్రక్రియ కొనసాగుతోంది. స్పౌజ్ పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెల నుంచే పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో సుమారుగా 6 వేలపైనే ధరఖాస్తులు చేసుకు న్నారు. ఎలాగూ కొత్త పింఛన్లు ఇవ్వడం లేదన్న కారణంతో అర్హులుగా ఉన్నవారు దర ఖాస్తులు చేసుకోవడం లేదు. వారందరూ దరఖాస్తులు చేసుకుంటే మరింత సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

● నిబంధనల మేరకు..

ప్రభుత్వ నిబంధనల మేరకు వయస్సు మీద పడ్డ వారు, వితంతు వులు, వికలాంగులు, అర్హులైన వారు ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికీ కొత్తగా మం జూరు చేయకపో వడంతో ఆయా మండలాల పరిధిలోని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సుమారుగా రెండున్నరేళ్ల నుంచి పింఛన్ల కోసం దరఖా స్తులు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపో వడంతో ఆందోళన చెందుతున్నారు. చాలా మంది ఎంపీడీవో, మున్సిపల్ కార్యా లయాలు, కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు అందజేసి మంజూరుకు ఎదురు చూస్తున్నారు.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 335 గ్రామ పంచాయతీల్లో ఆసరా పింఛన్ల లబ్ధిదారులు 54,861 మంది ఉన్నారు. వీరికి సుమారుగా 13.2 కోట్ల మేర రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా పోస్టల్ శాఖకు అందజేస్తోంది. బ్రాంచ్ పోస్టు మాస్టర్ల ద్వారా ప్రతీ నెలా 1వ తేదీన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వృద్ధులు 23,696 మంది, దివ్యాంగులు 5,905 మంది, గీత కార్మికులు 135 మంది, ఒంటరి మహిళలు 2,588 మంది, వితంతువులు 21,855 మంది, బోధకాల వ్యాధి గ్రస్తులు 559 మంది, బీడీ కార్మికులు 87, మూత్ర పిండ వ్యాధి బాధితులు 36 మంది పింఛన్లు పొందుతున్నారు.

అర్హులకు ఆసరా పింఛన్లు ఇవ్వాలి
- రంగన్న చౌదరి, చింతలమానేపల్లి



ప్రభుత్వం అర్హులందరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి. ప్రభుత్వ సూచన మేరకు దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఆందోళన నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ అమలు చేయాలి.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

లింగాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన లింగాపూర్ మండలంలోని జాముల్‌ధరా గ్రామ పంచాయతీలో గురువారం ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల మంజూరైన వారు పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లిస్తామని తెలిపారు. డబ్బులు లేక పోవడంతో పనులు చేపట్టడం లేదని పలువురు ఆయనకు వివరించారు. దీంతో మహిళా సంఘాల ద్వారా రుణాలను మంజూరు చేయించాలని ఐకేపీ ఏపీఎంను ఆదేశించారు. అనంతరం గ్రామానికి సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిని పరిశీలించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ రాకేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరేష్, ఎంపీడీవో రామచందర్ తదితరులు పాల్గొన్నారు,

భార్యను హత్య చేసిన భర్త

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం వంజీరిలో నివాసముంటున్న జయరాం తన రెండో భార్య పోచుబాయి(45)ని బుధవారం రాత్రి హత్య చేశాడని ఎస్సై సందీప్ తెలిపారు. జయరాంకు మగ సంతానం కోసం రెండో భార్యగా పోచుబాయిని పెళ్లి చేసుకున్నాడని చెప్పారు. తరుచూ ఇరుగుపొరుగు వారితో గొడవలు పడుతుండటంతో బుధవారం రాత్రి భర్త పోచుబాయిని నిలదీశాడని తెలిపారు. వాగ్వాదం జరుగడంతో కోపోద్రిక్తుడైన భర్త జయరాం పక్కనే ఉన్న ఇనుప వస్తువుతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందిందని తెలిపారు. పోచుబాయి తల్లి ఫిర్యాదు మేరకు జయరాంపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

దహెగాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని ఓ గ్రామానికి చెందిన కామెర హోక్టుపై బాలికను వేధించిన కేసులో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. బాలిక(11) తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. అక్కాచెల్లుళ్లు ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. బాలికతో హోక్టు అసభ్యకరంగా ప్రవర్తించాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న తల్లికి బాలిక విషయం చెప్పింది. దీంతో బుధవారం సాయంత్రం తల్లి ఫిర్యాదు చేయగా హోక్టుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాగజ్‌నగర్ సీఐ బదిలీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ గురువారం హైదరాబాద్ ఐజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. చేశారు. రామగుండం మంచిర్యాల ఎస్‌బి విభాంలో పని చేస్తున్న సీఐ కోడి ప్రేంకుమార్‌ను కాగజ్‌నగర్‌కు బదిలీ చేశారు. కాగజ్‌నగర్ సీఐ రాజేంద్రప్రసాద్ ఆరునెలల క్రితం విధుల్లోకి చేరారు. పట్టణంలో గంజా, మట్కా దందాను నడపకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు మట్కా ఆడిన 20 మందికిపైగా కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. విధుల్లో చేరి ఆరు నెలల్లోనే బదిలీ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ అజయ్

వాంకిడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై దృష్టి సారించి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో డైలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డబ్ల్యూపీఎల్ సెషన్- 3 పోటీల్లో గెలుపొందిన రైన్‌బో జట్టుకు గురువారం రూ. 75,000 నగదు, కప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని చెప్పారు. ఓటమి పాలైన వారు నిరుత్సాహపడకుండా మరోసారి గెలుపుకోసం ప్రయత్నించాలని సూచించారు. క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెరిగి యువత వ్యసనాలకు దూరం ఉండడానికి దోహద పడతాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎల్లవేళలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బండె తుకారాం, సయ్యద్ అయ్యూబ్, మాజీ ఎంపీటీసీ వినోద్, బిజేవైఎం రాష్ట్ర నాయకుడు సుచిత్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సెండె వాసు, నిర్వాహకులు గాదే శివకుమార్, శ్రీకాంత్, ఎంగలి రాకేష్, క్రిడాకారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కెరమెరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం భూ భారతి తీసుకొచ్చిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కేస్లాగూడ రైతు వేదికలో గురువారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని 18 రాష్ట్రాల్లో భూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి నూతన చట్టాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూన్ నుంచి అమలు చేస్తుందని తెలిపారు. ఈ చట్టం ద్వారా రైతులకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఆధార్‌కార్డులాగా భూమికి సంబంధించిన భూదార్ కార్డు రైతులకు అందించనున్నా మన్నారు. భూదార్ కార్డులో రైతులకు సంబంధించిన భూమి వివరాలు, హద్దుల మ్యాపింగ్ చేసి ఆధునాతన టెక్నాలజీతో కార్డులు రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. చట్టంలో రైతులకు న్యాయం జరగని పక్షంలో ఆర్డీవోకు, కలెక్టర్‌లకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అటవీ హక్కు భూముల కోసం రెవెన్యూ, అటవీ అధికారులు ఉమ్మడి సర్వే చేపడుతారని తెలిపారు. ఎమ్మెల్యే దండె విఠల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో పడేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. ధరణి పోర్టల్ వల్ల రైతులు పదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రైతులు ఇబ్బందులు పడకూడదనే ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చిందని చెప్పారు. గ్రామాల్లో రెవె న్యూ అధికారులు పర్యటించి భూ సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. త్వరలోనే గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో ల్యాండ్ సర్వేయర్‌లను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్, మాజీ వైస్ ఎంపీపీ కలాం, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీవో అంజద్‌పాషా, వ్యవసాయాధికారులు వెంకట్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఆశోక్‌కాలనీకి చెందిన కె సదానందం(39) పెళ్లి కావడం లేదని మనస్తాపం చెంది గురువారం ఉదయం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై యాదగిరి తెలిపారు. ఆశోక్ కాలనీలో ఉన్న సదానందంకు పెళ్లి కావటం లేదన్నారు. మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి

వాంకిడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. సామెల గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ.13 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను గురువారంప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, ప్రశాంత్, జీవన్, నాగభూషణ్, సంతోష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

రెబ్బెన, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం చలో వరంగల్ పోస్టర్లను మండల శాఖ అధ్యక్షుడు పిశ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కె సంజీవ్ కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేష్, మాజీ జడ్పీటీసీ బాబురావు, మాజీ సర్పంచ్ అహల్యాదేవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్

వాంకిడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ శాఖలో నకిలీ కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం చేస్తున్న వ్యక్తిపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని భారతీయ బౌద్ధ మహాసభ అంబేద్కర్ సంఘం, సమతా సైనిక్ దళ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానికంగా జేత్వాన్ బుద్ధ విహార్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన రావూరి శ్రీనివాసరావు ఎనిమిదేళ్లగా నకిలీ పత్రాలతో ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఆయన కుల ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేయకపోవడం దారుణమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో హరి జన మాల అనే కులం ఎస్సీ జాబితాలో లేదన్నారు. ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌లో కూడా జరగలేదన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన శాఖ పరమైన తనిఖీల్లో విషయం బయట పడిందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో విజయ్, సందీప్, జైరాం, ప్రతాప్, నానాజీ, మనోజ్, జైపాల్, మహేష్, రమేష్, పోచాలు, మాజీత్, నూతన్, శ్రీకాంత్, ఏక్నాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి గురువారం ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో చేశారు. ఈ సందర్భంగా దండే విఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సముచిత స్థానం ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయాలు పేదలకు ప్రయోజనకరంగా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరికి వారికి కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తాటిపెల్లి మాజీ సర్పంచి బండు, మాజీ వార్డు సభ్యుడు గోలేం రమేష్, నాయకులు లింగయ్య, తులసిరాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ జిల్లా పరిశీలకుడిగా అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్‌ను కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పీసీసీ పరిశీలకుడిగా రాష్ట్ర కమిటీ నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు అన్ని జిల్లాలకు పరిశీలకులను రాష్ట్ర కమిటీ నియమించింది. ఇందులో భాగంగా సుల్తానాబాద్‌కు చెందిన అన్నయ్య గౌడ్‌ను కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు నియమించింది.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సిర్పూర్(టి), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కమలాకర్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గుర్తు తెలియని నంబర్ నుంచి వచ్చే ఫోన్ కాల్‌ను ఎట్టి పరిస్థితుల్లో లిఫ్ట్ చేయవద్దన్నారు. అపరిచిత వ్యక్తులు అడిగే ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లో తెలియ జేయవద్దని చెప్పారు. ఆయన వెంట పోలీసులు హనుమంతు, మాధురి, విజయలక్ష్మి, హాజీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి ఆవులు వితరణ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రానికి నాలుగు గిరి ఆవులను హైదరాబాద్‌కు చెందిన వాసి హేమంత్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఉచితంగా అందరికి నిత్యం అన్నదానం చేయడం అభినందనీయమని చెప్పారు. తాను ఈ సత్రానికి నాలుగు గిరి ఆవులను దానం చేశానని అన్నారు. ఒక్కో ఆవు రోజుకు 10 లీటర్ల పాలు ఇస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ నిత్యాన్నదాన సత్రానికి ఆవులు దానం చేసిన హేమంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి కోనేరు రమాదేవి, జిల్లా జడ్పీ ఇన్‌చార్జీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజ కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి



కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. చేతన్ ఫౌండేషన్ సహకారంతో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బెజ్జూరు మండలం సలుగుపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం లంబాడిగూడ వార సంతలో మాజీ ఎమ్మెల్యే అంబలి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, సకారాం, శ్రీనివాస్, సాయి, బషరత్‌ఖాన్, హన్మంతు, వెంకన్న, ఇస్తారి, నరేందర్‌గౌడ్, అమీరోద్దీన్ పాల్గొన్నారు.